
సాక్షి
వికారాబాద్
మంగళవారం । 7 । ఫిబ్రవరి । 2023





రుణాల మంజూరుపై నిరసన
కార్పొరేషన్ లబ్ధిదారులు వందల్లో ఉండగా కేవలం ఆరు యూనిట్లు మంజూరు చేయడంపై ముస్లిం మైనార్టీలు నిరసన చేపట్టారు. 10లో▸

కట్టా.. మీటా



వికారాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లాకు మిశ్రమ స్పందన లభించింది. పర్యాటక, సాగునీటి రంగాల విషయంలో ఉసూరుమనిపించగా.. ఉద్యోగులు, వ్యవసాయానికి వెన్నుదన్నుగా నిలిచింది. అందరూ ఊహించనట్లుగానే ప్రభుత్వం ఈసారి కూడా భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. 2023– 24 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.2,90,396 కోట్లతో ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సోమవారం తన పద్దును వినిపించారు. ఇందులో రైతులకు పెద్దపీట వేశారు. వ్యవసాయ రంగానికి చెందిన నాలుగైదు విభాగాలకు భారీ కేటాయింపులు చేశారు. దీంతో జిల్లాలో అత్యధిక శాతం మందికి ఊరట లభించనుంది. కానీ కొన్నేళ్లుగా వ్యవసాయ యాంత్రీకరణను పాతరేస్తూ వస్తున్న ప్రభుత్వం ఈసారి కూడా మొండిచేయి చూపడం కొంత నిరాశపర్చింది.

'డబుల్' మోదం

సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేసుకుంటూ చేసిన కేటాయింపులతో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకం పనులు వేగం పుంజుకోనున్నాయి. వ్యక్తిగతంగా ఇళ్లు నిర్మించుకునే వారికి ఈసారి రూ.3 లక్షల చొప్పున కేటాయిస్తామని చెప్పిన నేపథ్యంలో జిల్లాలోని సుమారు 7వేల మంది లబ్ధిదారులకు మేలు చేకూరనుంది. రుణమాఫీ ప్రకటన ద్వారా 50వేల మంది రైతులకు ఊరట దక్కనుంది. మోమిన్‌పేట్ మండలం ఎన్కతల రెవెన్యూ పరిధిలో మొబిలిటీ వ్యాలీ ఏర్పాటు చేస్తామని మంత్రి కేటీఆర్ ప్రకటించడం శుభపరిణామం. దీంతో అక్కడ ఎలక్ట్రిక్ వాహనాల తయారీ యూనిట్ ఏర్పాటు కానుంది. దీనిద్వారా ఈ ప్రాంత వాసులకు ఉపాధి లభించనుంది. ఇదిలా ఉండగా రాష్ట్ర బడ్జెట్‌పై ప్రతిపక్షాలు పెదవి విరుస్తున్నాయి. అంకెల గారడీ తప్ప ఏమీ లేదని ఎద్దేవా చేస్తున్నాయి.

రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాకు మిశ్రమ స్పందన

- వ్యవసాయానికి పెద్దపీట, రుణమాఫీపై ఆశలు
- యాంత్రీకరణకు పాతర
- సాగునీటి ప్రాజెక్టులపై చిన్నచూపు
- ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులకు ఊరట
- మోమిన్‌పేటలో మొబిలిటీ వ్యాలీ

అనంతగిరికి రిక్తహస్తమే..

జిల్లాలో ప్రసిద్ధి చెందిన అనంతపద్మనాభస్వామి దేవాలయ సమీపంలోని అనంతగిరి కొండల నుంచే మూసీ నది ప్రారంభమవుతుంది. ఈ ప్రాంతం పర్యాటకంగానే కాకుండా ఆధ్యాత్మికపరంగానూ ప్రసిద్ధి చెందింది. అనంతగిరి అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని చెప్పిన సీఎం కేసీఆర్, మంత్రుల హామీలు ఈ బడ్జెట్‌లోనూ నెరవేరలేదు. గత బడ్జెట్‌లో యాదాద్రి, వేములవాడ, బాసర తదితర ఆలయాలకు రూ.వందల కోట్లు కేటాయించిన ప్రభుత్వం.. రాజధాని నగరానికి కూతవేటు దూరంలో ఉన్న అనంతగిరిని విస్మరించింది.

ప్రస్తావనతోనే సరి

జిల్లాలో సాగునీటికి వరప్రదాయినిగా భావించే పాలమూరు ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయించలేదు. అతిపెద్ద ప్రాజెక్టు అయిన పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును నిర్మిస్తామనే ప్రస్తావనతో ముగించారు.. కేటాయింపులు మాత్రం చేయలేదు. ఇది జిల్లా ప్రజలను అసహనానికి గురిచేస్తోంది. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా మహబూబ్‌నగర్ పరిధిలో నిర్మిస్తున్న రిజర్వాయర్లు దాదాపు పూర్తి కావస్తుండగా వికారాబాద్ జిల్లాకు నీరందించే రిజర్వాయర్ల ఊసెత్తలేదు. జిల్లాలోని పరిగి– కొందుర్గు మండలాల మధ్య ఉన్న కేపీలక్ష్మీదేవిపల్లి వద్ద రిజర్వాయర్ నిర్మిస్తామని చాలా కాలంగా చెబుతున్నా ఇప్పటివరకు తట్టెడు మట్టి తీయలేదు. కోట్‌పల్లి ప్రాజెక్టు, కాల్వల మరమ్మతు కోసం రూ.38 కోట్లతో ప్రతిపాదనలు పంపగా కేటాయింపులు కనిపించలేదు. జిల్లాలోని జుంటుపల్లి, లఖ్నాపూర్, సర్పన్‌పల్లి తదితర ప్రాజెక్టుల కాల్వలు పూర్తిగా పాడై ఆయకట్టు తగ్గిపోగా వీటి మరమ్మతులకు ఎలాంటి నిధులివ్వలేదు.

ఉద్యోగులకు ఊరట

ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉద్యోగులకు ఊరట లభించనుంది. హెల్త్ కార్డులు పనిచేయకపోవడంతో ఉపాధ్యాయులు, ఉద్యోగులు కొంతకాలంగా అవస్థలు పడుతున్నారు. వీటిని వెంటనే వినియోగంలోకి తేవడంతో పాటు కేటాయింపులకు హామీ ఇచ్చారు. దీంతో జిల్లాలో పనిచేస్తున్న 7,200 మందికి ఊరట లభించనుంది. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ హామీతో జిల్లాలోని జూనియర్ కళాశాలలు, పశు సంవర్ధక శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న 165 మంది ఉద్యోగులు రెగ్యులరైజ్ కానున్నారు. సెర్ప్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటించారు. దీంతో జిల్లాలో ఉన్న 165 మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది.

బడ్జెట్ బ్రహ్మాండం



ఈసారి బడ్జెట్ బ్రహ్మాండంగా ఉంది. ఉద్యోగులకు ఆరోగ్య భరోసా, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, సెర్ప్ సిబ్బందికి పీఆర్సీ అమలు వంటివి శుభపరిణామం. పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టును పూర్తి చేస్తామని ప్రకటించటం జిల్లాకు గొప్ప అచీవ్‌మెంట్. బడ్జెట్‌లో అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యం లభించింది. వ్యవసాయం దళితబంధు, డబుల్ బెడ్‌రూం ఇళ్లకు పెద్ద పీట వేసింది. పేదల సొంతింటి కల తీరనుంది.

– కొప్పుల మహేశ్‌రెడ్డి, ఎమ్మెల్యే, పరిగి

కేటాయింపులు ఉత్తిమాటే..



బడ్జెట్‌లో భారీ కేటాయింపులు చూపిస్తున్నా.. ఎక్కడా ఖర్చు పెట్టిన దాఖలాలు కనిపించడం లేదు. 2108లో నిరుద్యోగ భృతి ఇస్తామంటే రాష్ట్రంలో 25లక్షల మంది యువకులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. బడ్జెట్‌లో ఆ ఊసేలేదు. పాలమూరు ఎత్తిపోతలకు ప్రత్యేక నిధుల కేటాయింపులేదు. జిల్లాలో ఒక్క డబుల్ బెడ్‌రూం ఇల్లు కూడా ఇవ్వలేదు. గతంలో రూ.5 లక్షలని చెప్పి, ఇప్పుడు రూ.3 లక్షలు అంటున్నారు.

– రామ్మోహన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు

జిల్లాకు అన్యాయం



టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక తొమ్మిదేళ్లుగా ప్రవేశ పెట్టిన అన్ని బడ్జెట్‌లలో జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగింది. ఉత్తర తెలంగాణ జిల్లాలకు నేరుగా కేటాయింపులు చేస్తుండగా మన జిల్లాకు జనరల్ ఫండ్స్ తప్ప ప్రత్యేక కేటాయింపుల ప్రస్తావన లేదు. ఇది ముమ్మాటికీ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధుల వైఫల్యమే. టీఆర్ఎస్‌కు మన జిల్లాపైన ఉన్న చిన్నచూపునకు నిదర్శనం. పాలకుల తీరు మారకపోతే అభివృద్ధి వికేంద్రీకరణ జరగదు.

– ముకుంద్ నాగేశ్వర్, జేపీసీ జిల్లా చైర్మన్

న్యూస్‌రీల్

అనంతుడి సేవలో కలెక్టర్



కలెక్టర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న అర్చకులు

అనంతగిరి: కలెక్టర్ నారాయణ్‌రెడ్డి సోమవారం తెల్లవారుజామున కుటుంబ సమేతంగా పద్మనాభస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి అభిషేకం, అర్చన చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ విశిష్టత, స్థలపురాణాన్ని వివరించారు. శాలువా, జ్ఞాపికతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ నరేందర్, ట్రస్టీ పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌కు రాజరాజేశ్వర విశిష్ట పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న జానపద కళాకారుడు అశోక్

తాండూరు టౌన్: పట్టణానికి చెందిన జానపద కళాకారుడు, ఫైన్‌ఆర్ట్స్ కల్చరల్ అకాడమీ అధ్యక్షుడు అశోక్‌కు రాజరాజేశ్వర విశిష్ట పురస్కారం దక్కింది. మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం సిరిసిల్ల రాజన్న జిల్లా వేములవాడలో అభినయ ఉత్సవం– 2023 కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, జానపద కళలు, గిరిజన నృత్యాల ప్రదర్శనతో పాటు, 350పైగా పోతరాజు వేషధారణ ప్రదర్శనలు ఇచ్చినందుకు గాను ఆయనకు పురస్కారం దక్కింది. ఈ కార్యక్రమంలో ఆంధ్ర మహాసభ ప్రతినిధులు రాధామోహన్, సుధాకర్, దేవాలయ కమిటీ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ అరుణ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పెన్షన్ ఇవ్వాలి



కలెక్టర్‌ను కలిసిన దివ్యాంగులు

అనంతగిరి: అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ మంజూరు చేయాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు పోతురాజు సుధీర్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు ఇబ్బంది కాకుండా కలెక్టర్ వారి వద్దకే వచ్చి వినతిపత్రం తీసుకున్నారు. అనంతరం సుధీర్ మాట్లాడుతూ.. వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు పంపిణీ చేయాలని కోరారు. ప్రభుత్వ ఆఫీసుల వద్ద ర్యాంపులు ఏర్పాటు చేయాలని, సదరం క్యాంపునకు వెళ్లిన వారం రోజుల్లో సర్టిఫికెట్లు అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశం, హన్మంతు, ఆంజనేయులు, మహేందర్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

16, 17 తేదీల్లో డప్పు దరువు పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

అనంతగిరి: ది లైట్ ఫౌండేషన్, తెలంగాణ లగోరి అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 16, 17 తేదీల్లో రాష్ట్ర స్థాయి డప్పు దరువు నృత్యపోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ఫౌండర్ డాక్టర్ టి.ఆనంద్, లగోరి అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్, ఉపాధ్యక్షుడు రాఘవన్‌నాయక్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను వికారాబాద్‌లో సోమవారం వారు ఆవిష్కరించారు. మోమిన్‌పేట్‌లో ఈ పోటీలు ఉంటాయని, ప్రథమ బహుమతి రూ.40 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, తృతీయ బహుమతి రూ.20 వేలతో పాటు ట్రోఫీలు అందజేస్తామన్నారు. ఇందులో పాల్గొనే వారు రూ.500 ప్రవేశ రుసుము చెల్లించాలని సూచించారు. పోటీల్లో పాల్గొని డప్పు కళాకారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాలన్నారు. వివరాలకు సెల్: 9014222830లో సంప్రదించాలని తెలిపారు. గ్రామీణ కళలను ప్రోత్సహించేందుకే పోటీలు నిర్వహిస్తున్నట్లు స్పష్టంచేశారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు



తోపుడు బండ్ల వ్యాపారులతో మాట్లాడుతున్న డీఎస్పీ శేఖర్‌గౌడ్

తాండూరు టౌన్: తోపుడు బండ్లను రోడ్లపై పెడితే చర్యలు తప్పవని డీఎస్పీ శేఖర్‌గౌడ్ హెచ్చరించారు. పట్టణంలోని చిరువ్యాపారులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. కొంతమంది రోడ్లపై అడ్డదిడ్డంగా తోపుడు బండ్లు నిలిపి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారన్నారు. ఇకపై వీటిని నిలిపేందుకు అనువుగా రోడ్లపై తెల్లని పెయింట్‌తో గీతలు వేయిస్తామని తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందని సూచించారు. ఎవరికీ ఇబ్బందులు తలెత్తకుండా వ్యాపారం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐ రాజేందర్‌రెడ్డి, ట్రాఫిక్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శిక్షణ కేంద్రం తనిఖీ



ట్రైనింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

అనంతగిరి: వికారాబాద్‌లోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రాన్ని ఎస్పీ కోటిరెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. శిక్షణ కోసం వచ్చే సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఇందుకోసం ఏవైనా మరమ్మతులు అవసరమైతే వెంటనే పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయన వెంట డీటీసీ ఏఎస్పీ మురళీధర్, డీఎస్పీ విజయ తదితరులు పాల్గొన్నారు.



వర్చువల్‌లో మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి

పేదలకు ఉచిత న్యాయ సేవలు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్
- న్యాయసేవ అధికార సంస్థ కార్యాలయం ప్రారంభం

అనంతగిరి: పేద ప్రజలకు ఉచిత న్యాయ సేవలు అందించేందుకు జాతీయ న్యాయసేవ అధికార సంస్థ ఎంతగానో కృషిచేస్తోందని ఆ సంస్థ జిల్లా చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.సుదర్శన్, సీనియర్ సివిల్ జడ్జి డీబీ శీతల్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన డిఫెన్స్ లీగల్ కౌన్సిల్ ఆఫీసును హైకోర్టు న్యాయమూర్తి ఉజ్జల్ భుయాన్, రాష్ట్ర న్యాయసేవా అధికార సంస్థ ఎగ్జిక్యూటీవ్ చైర్మన్ నవీన్‌రావు వర్చువల్‌గా ప్రారంభించారు. వికారాబాద్ కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన డిఫెన్స్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ కార్యాలయాలను జస్టిస్ సుదర్శన్, జస్టిస్ శీతల్ సోమవారం ప్రారంభించారు. చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా టి.వెంకటేశ్, డిప్యూటీ డిఫెన్స్ కౌన్సిల్‌గా రాముకు బాధ్యతలు అప్పగించారు. అనంతరం ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. నేరారోపణ ఎదుర్కొంటున్నవారు న్యాయవాదిని పెట్టుకోలేని స్థితిలో ఉంటే వారి తరఫున లీగల్ ఎయిడ్ కౌన్సిళ్లను అపాయింట్ చేస్తామన్నారు. బాధితుల తరఫున వీరు కేసు వాదిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శి జగన్ పలువురు సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

పండ్ల మార్కెట్‌ను కోహెడకే తరలించాలి



మంత్రి నిరంజన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేస్తున్న పండ్ల వ్యాపారుల అసోసియేషన్ ప్రతినిధులు

- మంత్రి నిరంజన్‌రెడ్డికి పండ్ల వ్యాపారుల విజ్ఞప్తి

అబ్దుల్లాపూర్‌మెట్ : కోహెడలోని పండ్ల మార్కెట్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, బాటసింగారం నుంచి కోహెడకు మాత్రమే తరలించాలంటూ పండ్ల వ్యాపారుల అసోసియేషన్ నాయకులు సోమవారం వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రగతి ఫ్రూట్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు జిన్నం వెంకటేశ్వర్లు, కార్యదర్శి నర్సింహ, దిఫ్రూట్ కమిషన్ అండ్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్, కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రస్తుతం బాటసింగారంలో కొనసాగుతున్న తాత్కాలిక పండ్ల మార్కెట్ అందరికీ సౌకర్యవంతంగానే ఉందన్నారు. కొంతమంది తమ స్వలాభం కోసం మామిడిపల్లిలోనిది ప్రైవేటు మార్కెట్ అని అందరినీ తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. హైదరాబాద్ నగరం చుట్టూ మార్కెట్ విస్తరించాలని ముఖ్యమంత్రి సూచించారే తప్ప, ఒకే మార్కెట్ నోటిఫైడ్ ఏరియాలో రెండు మార్కెట్లు ఉండాలని పేర్కొనలేదని మంత్రికి వివరించినట్లు పేర్కొన్నారు. ఒకేచోట రెండు మార్కెట్లను విభజిస్తే రైతులు, కమీషన్‌దారులు నష్టపోతారని, అందుకే మామిడిపల్లిలో మార్కెట్‌ను అనుమతించొద్దని, కోహెడలో త్వరితగతిన మార్కెట్‌ను పూర్తి చేసి స్థలాలు కేటాయించాలని కోరారు.

వందశాతం అందుబాటులో ఉంటా

- ప్రజావాణి ఫిర్యాదులను వారం రోజుల్లో పరిష్కరించాలి
- కలెక్టరేట్‌లో బయోమెట్రిక్ హాజరుకు ఏర్పాట్లు
- జిల్లాను అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా పనిచేయాలి
- కలెక్టర్ నారాయణ్‌రెడ్డి
- ప్రజావాణికి 142 దరఖాస్తులు



ప్రజావాణిలో వినతిపత్రం తీసుకుంటున్న కలెక్టర్ నారాయణ్‌రెడ్డి

అనంతగిరి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం వందశాతం అందుబాటులో ఉంటానని కలెక్టర్ నారాయణ్‌రెడ్డి అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను వారం రోజుల్లో పరిష్కరించే దిశగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా అధికారులతో మాట్లాడుతూ.. ప్రతీసోమవారం ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అధికారులందరూ ప్రజావాణిలో ఉండాలని సూచించారు. ఫిర్యాదుదారులతో మమేకమై వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కార మార్గాలు చూపాలన్నారు. ఈప్రక్రియలో ఏవైనా ఇబ్బందులు ఉంటే వారికి అర్థమయ్యేవిధంగా చెప్పాలన్నారు. కలెక్టర్‌గా అధికారులందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, సమయపాలన పాటిస్తూ మెరుగైన సేవలు అందించాలని కోరారు. ప్రజలు ప్రజాప్రతినిధుల సహకారంతో పారదర్శకంగా ముందుకు సాగాలని సూచించారు. వారంలో 5 రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల్లో పురోగతి సాధించాలని తెలిపారు. తమ ఆధీనంలోని కిందిస్థాయి సిబ్బంది నుంచి మంచి ఫలితాలు రాబట్టాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, పథకాలపై నిక్కచ్చిగా వ్యవహరించాలని సూచించారు. అధికారులందరూ టీం వర్క్‌గా పనిచేసి రాష్ట్రంలో జిల్లాను టాప్– 5లో నిలపాలన్నారు. రాబోయే రెండు, మూడు రోజుల్లో కలెక్టర్ కార్యాలయంలో బయోమెట్రిక్ మిషన్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తామని స్పష్టంచేశారు. బయోమెట్రిక్ ఆధారంగానే ట్రెజరీల ద్వారా ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు అందిస్తామని తెలిపారు. ప్రజావాణిలో మొత్తం 142 దరఖాస్తులు స్వీకరించారు. వీటిని సంబంధిత శాఖలకు పంపించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ, డీఆర్‌ఓ అశోక్‌కుమార్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సంచిత్‌గంగ్వార్, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త సంస్కరణలు అవసరం

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే సంకల్పంతో జీఈఓ అటెండెన్స్ యాప్‌ను ప్రవేశపెడుతున్నట్లు కలెక్టర్ నారాయణ్‌రెడ్డి తెలిపారు. పంచాయతీల్లో పనిచేస్తున్న టెక్నికల్ సిబ్బందికి ఏర్పాటు చేసిన జియో అటెండెన్స్ యాప్ అప్‌లోడింగ్‌పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల పనితనంలో మార్పు రావాలంటే కొత్త సంస్కరణలు ఎంతైనా అవసరమన్నారు. గవర్నమెంట్ ఎంప్లాయీ ఆర్బిట్ అటెండెన్స్ యాప్‌తో విధులకు సక్రమంగా హాజరు కాని వారిని వెంటనే గుర్తించవచ్చని తెలిపారు. ఇది ఉద్యోగులను ఇబ్బంది పెట్టే చర్య కాదని, పారదర్శకమైన సేవలకేనని గుర్తించాలన్నారు. ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగులు పనిచేయకపోతే.. యజమానికి నష్టం కలుగుతుందని, ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు పనిచేయకపోతే ప్రజలకు నష్టం వాటిల్లుతుందని చెప్పారు. వారం రోజుల్లో ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అందరూ ఇదేపనిపై ఉండాలన్నారు. ప్రతీ శాఖ నుంచి ఒక టెక్నికల్ టీంను తీసుకుని, రెండు రోజుల్లో ఈ యాప్ పనులను పూర్తి చేయాలన్నారు. బయోమెట్రిక్ అటెండెన్స్ ఆధారంగానే జీతాల చెల్లింపులు జరుగుతాయన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ, డీపీఓ తరుణ్‌కుమార్, డీఎల్‌పీఓలు శంకర్, అనిత, టెక్నికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో కారం మెతుకులు

- కడుపు మంటతో అవస్థలు
- కలెక్టర్‌కు ఓ విద్యార్థిని ఫిర్యాదు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని

షాద్‌నగర్: విద్యార్థులకు పౌష్టిక విలువలతో కూడిన ఆహారం అందించాలని ప్రభుత్వం ఓవైపు చెబుతోంది. కానీ కస్తూర్బాగాంధీ వసతి గృహంలో నిర్వాహకులు మాత్రం విద్యార్థినులకు కారం పొడితో భోజనం పెడుతున్నారు. ఫలితంగా చాలామంది కడుపు మంటతో ఇంటి బాట పడుతున్నారు. దీనిపై షాద్‌నగర్ పరిధిలోని మొగిలిగిద్దలో ఉన్న కేజీబీవీ వసతి గృహానికి చెందిన ఓ విద్యార్థిని సోమవారం కలెక్టర్, స్థానిక ఎంఈఓకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. షాద్‌నగర్ పరిధిలోని మొగిలిగిద్దలో ఉన్న కేజీబీవీలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు సుమారు 364 మంది విద్యార్థినులు విద్యాభ్యాసం చేస్తున్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

మొగిలిగిద్ద కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న శ్రావణి అనారోగ్యానికి గురై షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ మేరకు ఆమె సోమవారం కలెక్టర్, ఎంఈఓకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. కేజీబీవీలో కొంత కాలంగా మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని.. ఉదయం వేళ అల్పాహారంలో కారం పొడితో, మధ్యాహ్నం నీళ్ల చారుతో భోజనం పెడుతున్నారని, తాగునీరు కూడా సరిగా ఇవ్వడం లేదని ఫిర్యాదులో ఆరోపించింది. కారం పొడితో అన్నం పెడుతుండటంతో కడుపులో మంట, నొప్పి వంటి సమస్యలతో చాలామంది బాధపడుతున్నారని, ఇప్పటి వరకు సుమారు 20 మంది ఆరోగ్య సమస్యలతో ఇంటికి వెళ్లారని ఫిర్యాదులో పేర్కొంది. ఒక్కో తరగతి గదిలో సుమారు 40 మంది విద్యార్థులు ఉంటే కేవలం ఒక వాటర్ బాటిల్ మాత్రమే ఇస్తున్నారని, వీటిని ఉదయం నుంచి రాత్రి వరకు అందరం తాగుతున్నామని పేర్కొంది. ఈ విషయమై పాఠశాల ఇన్‌చార్జికి ఫిర్యాదు చేస్తే తమకే పనిష్మెంట్ ఇస్తోందని ఫిర్యాదులో ఆందోళన వ్యక్తం చేసింది.

క్లుప్తంగా

అర్ధనారీశ్వరుడిగా శివయ్య దర్శనం



తాండూరు టౌన్: భావిగి భద్రేశ్వర దేవస్థానంలో పరమశివుడు అర్ధనారీశ్వరుడిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహా శివరాత్రి పర్వదిన మాసాన్ని పురస్కరించుకుని సోమవారం ఆలయ పూజారి విజయకుమార స్వామి శివుడిని అర్ధనారీశ్వరుడిగా అలంకరించారు. అత్యంత సుందర అలంకరణలో ఉన్న స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు.

అనాథ చిన్నారులకు బంగారు ఆభరణాలు



బాలసదనంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

పరిగి: ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి ప్రతిమారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు హరిప్రియతో కలసి బాలసదనంలోని అనాథ చిన్నారులకు సోమవారం బంగారు చెవి దిద్దులను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అనాథ చిన్నారుల అభ్యున్నతికి పాటుపడతామన్నారు. బాలసదనంలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలసదనం సూపరింటెండెంట్ ఇందిర, మహిళా నాయకురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం

బంట్వారం: ఉపాధ్యాయుల సమస్యల పై పోరాటం కొనసాగిస్తామని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.వెంకటరత్నం అన్నారు. సోమవారం కోట్‌పల్లి మండలంలోని మోత్కుపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆ సంఘం క్యాలెండర్‌ను ఆయన ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటర్నతం మాట్లాడుతూ.. బదిలీలు, పదోన్నతులతో ఏర్పడే ఖాళీల్లో స్థానిక ఉపాధ్యాయులతో భర్తీ చేయాలన్నారు. కోర్టు కేసులతో సంబంధం లేని ఎస్‌ఏ తెలుగు, హిందీ, పీడీ అర్హత గల వారితో వెంటనే భర్తీ చేయాలంటూ ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

టీపీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి

అనంతగిరి: రాష్ట్రంలో సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని తీసుకురావాలని టీ పీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ప్రచారంలో భాగంగా జిల్లాలోని పలు పాఠశాలల్లో పర్యటించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. 317జీఓను వెనక్కి తీసుకుని 317 జీఓ బాధిత ఉపాధ్యాయులందరికీ స్థానికత కల్పించాలన్నారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులన్నింటిని జోన్ పోస్టులుగా మార్చాలన్నారు. భాషా పండితులకు, పీఈటీలకు ఈ బదిలీల షెడ్యూల్‌లోనే అప్‌గ్రేడేషన్ చేయాలన్నారు. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా బుగ్గప్ప



నియామకపత్రం అందుకుంటున్న బుగ్గప్ప

ధారూరు: కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ధారూరు మండల పరిధిలోని నాగసమందర్ గ్రామానికి చెందిన ఎం.బుగ్గప్పను సోమవారం నియమించారు. ఈ మేరకు ఎస్సీ సెల్ చైర్మన్ కె.రాజు అధిష్ఠానం ఉత్తర్వులను ఆయనకు అందజేసి శాలువా కప్పి పూలమాలతో సన్మానించారు.

వ్యక్తి ఆత్మహత్య

తలకొండపల్లి: మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. తలకొండపల్లికి చెందిన మాజీ కారోబార్, ముంతాపురం నరేందర్ (70) ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరి వేసుకొని మృతి చెందాడు. కొంత కాలంగా ఆయనకు మతిస్థిమితం సరిగ్గా లేదు. ఈ కారణంగానే ఆత్మహత్య చేసుకొని ఉంటాడని స్థానికులు తెలిపారు.

ఉత్సాహంగా ‘సాక్షి’ ప్రీమియర్ లీగ్

- ఫైనల్స్‌కు చేరిన జూనియర్ జట్లు..



గౌతమ్ కాలేజ్ జట్టు



జేఎన్టీయూ హైదరాబాద్ జట్టు

ఘట్‌కేసర్: మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా, ప్రతాపసింగారంలోని బాబురావు సాగర్ క్రికెట్ మైదానంలో సాక్షి ప్రీమియర్ లీగ్–4 (ఎస్‌పీఎల్) సోమవారం ఉత్సాహంగా కొనసాగాయి. ఈ పోటీల్లో గ్రేటర్ పరిధిలోని 65 జట్లు పాల్గొంటున్నాయి.

విజేతల వివరాలివీ...

బాబురావు సాగర్ క్రికెట్ మైదానం–1లో

- మొదటి మ్యాచ్ సీనియర్ విభాగంలో సైనిక్‌పురి భవాన్స్ వివేకానంద డిగ్రీ కాలేజ్–బి జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 58 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన అనురాగ్ యూనివర్సిటీ జట్టు 6.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 59 పరుగులు చేసి విజయం సాధించింది.
- రెండో మ్యాచ్ జూనియర్ విభాగంలో తిరుమలగిరి గౌతమ్ జూనియర్ కళాశాల జట్టు మొదట బ్యాటింగ్ చేసి 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 122 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన సికింద్రాబాద్ గవర్నమెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ జట్టు 9.3 ఓవర్లలో 56 పరుగులు చేసి ఓటమిపాలైంది.
- మూడో మ్యాచ్‌లో జూనియర్ విభాగంలో సైనిక్‌పురి భవాన్స్ శ్రీ అరబిందో కాలేజ్–ఎ జట్టు 10 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 151 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన తిరుమల్‌గిరి గౌతమ్ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 60 పరుగులు చేసి పరాజయం పాలైంది. భవాన్స్ జట్టు క్రీడాకారుడు సాధిక్ 40 బంతుల్లో 118 పరుగులు చేశాడు.

బాబురావు సాగర్ క్రికెట్ మైదానం–2

- మొదటి మ్యాచ్‌లో జూనియర్ విభాగంలో శ్రీ దత్త డిప్లమో కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 93 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన అవినాశ్ కాలేజ్ 5.5 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 96 పరుగులు చేసి గెలుపొందింది. అవినాశ్ జట్టు క్రీడాకారుడు సనద్ 23 బంతుల్లో 55 పరుగులు చేశాడు.
- రెండో మ్యాచ్ సీనియర్ విభాగంలో దిల్‌సుఖ్‌నగర్ అవంతి పీజీ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 67 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన భవాన్స్ వివేకానంద డిగ్రీ కాలేజ్–ఎ జట్టు 4.5 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 68 పరుగులు చేసి గెలుపొందింది.
- మూడో మ్యాచ్ జూనియర్ విభాగంలో గౌతమ్ కాలేజ్–ఎ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 123 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన అవినాశ్ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 64 పరుగులు చేసి పరాజయం పాలైంది.

బాబురావు సాగర్ క్రికెట్ మైదానం–3

- మొదటి మ్యాచ్‌లో శ్రీ అరబిందో జూనియర్ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 116 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన సీఎంఆర్ డిప్లమో కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 56 పరుగులు చేసి పరాజయం పాలయ్యింది.
- రెండో మ్యాచ్ సీనియర్ విభాగంలో జేఎన్టీయూ హైదరాబాద్‌హెచ్ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 76 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన కేపీఆర్‌ఐటీ కళాశాల జట్టు 10 ఓవర్లలో 74 పరుగులు చేసి పరాజయం పాలైంది.
- మూడో మ్యాచ్ సీనియర్ విభాగంలో సైనిక్‌పురి భవన్స్ వివేకానంద ఎ–జట్టు 10 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 141 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన జేఎన్టీయూ హైదరాబాద్ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 63 పరుగులు చేసి ఓడింది. భవాన్స్ క్రీడాకారుడు నితీశ్ 31 బంతుల్లో 68 పరుగులు చేశాడు.

ఫైనల్స్‌కు చేరిన జూనియర్ జట్లు...

- జూనియర్ విభాగంలో సైనిక్‌పురి భవన్స్ శ్రీ అరబిందో కాలేజ్, ఈసీఐఎల్ గౌతమ్ కాలేజ్ జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నాయి.

ధరణి సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కలెక్టర్

- తహసీల్దార్ కార్యాలయం, మీ సేవ కేంద్రాల్లో హెల్ప్‌డెస్క్
- 13 నుంచి మండల కేంద్రాల్లో ప్రజావాణి

అనంతగిరి: అన్నం పెట్టే అన్నదాతలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడం సరిదాని వారిని దేవుళ్లగా భావించాలని కలెక్టర్ నారాయణ్‌రెడ్డి అన్నారు. రైతు దరఖాస్తును పరిశీలించే ముందు అది ఒక కుటుంబంగా గుర్తు చేసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ధరణి ఫిర్యాదులపై అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ, డీఆర్‌ఓ అశోక్‌కుమార్‌తో కలిసి తహసీల్దార్‌లు, మండల సిబ్బందితో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెలరోజుల్లో ధరణి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నారాయణ్ రెడ్డి తహసీల్దార్‌లను ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రత్యేకంగా ధరణి హెల్ప్‌డెస్క్ ద్వారా దరఖాస్తులు స్వీకరించాలన్నారు. సమస్యలను ఓపికగా, సహనంతో వింటూ సమస్య పరిష్కారానికి సలహాలు ఇవ్వాలన్నారు. రెవెన్యూ సిబ్బంది నెలరోజుల పాటు ధరణి సమస్యలపైనే దృష్టి సారించి పని చేయాలన్నారు. హెల్ప్‌డెస్క్ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. సాంకేతిక సమస్యలు ఉంటే వాటిని సరిచేసుకుంటూ నివేదికలు పంపాలని, ఎట్టి పరిస్థితుల్లో తిరస్కరించకూడదన్నారు. దరఖాస్తు వాస్తవికంగా ఉంటే పట్టా పాసు పుస్తకాలు ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి మీ సేవ కేంద్రాలు ధరణి హెల్ప్‌డెస్క్‌లుగా మారాలని కలెక్టర్ తెలిపారు. మీ సేవా కేంద్రాల్లో తిరస్కరించబడే దరఖాస్తులను అప్‌లోడ్ చేయకుండా చూడాలని తెలిపారు. ప్రతి సోమవారం ప్రత్యేకంగా ధరణి ప్రజావాణి కార్యక్రమాన్ని చేపట్టి ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటలవరకు దరఖాస్తులు స్వీకరించాలన్నారు.

కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన

భాషా పండితులకు ప్రభుత్వం పదోన్నతులు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట వారు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల్లో పనిచేసే భాషా పండితులు తదితరులు ఉన్నారు.

ఆరోపణలు చేస్తే ఊరుకోం



బషీరాబాద్: మాట్లాడుతున్న రమేశ్ మహరాజ్

- తాండూరుపై ఎగిరేది కాంగ్రెస్ జెండానే
- హాథ్ సే హాథ్ జోడో యాత్రలో పీసీసీ ఉపాధ్యక్షుడు రమేశ్ మహరాజ్

బషీరాబాద్: మోసపూరిత పాలన సాగిస్తోన్న బీఆర్‌ఎస్‌ను ప్రజలు తరిమికొట్టాలని పీసీసీ ఉపాధ్యక్షుడు రమేశ్‌మహరాజ్ అన్నారు. సోమవారం తాండూరు నియోజకవర్గంలోని బషీరాబాద్ మండలం నవాంద్గి, గంగ్వార్ గ్రామాల్లో హాథ్ సే హాథ్ జోడో యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పాదయాత్ర చేస్తూ గ్రామస్తుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రమేశ్‌మహరాజ్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. రైతు వ్యతిరేక విధానాల వల్ల అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో తాండూరు నుంచి పోటీ చేసి గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. మా కుటుంబంపై ఆరోపణలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, పార్టీ మండల అధ్యక్షుడు శంకరప్ప, యూత్ ప్రెసిడెంట్ రాజవర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు రాకేశ్, ఉత్తమ్‌చంద్, జనార్ధన్‌రెడ్డి, నర్సింహులు గౌడ్, ఎంఎ అలీం, వీరేశం, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి కచరా వెళ్లింది: రాకేశ్

తాండూరు: హాథ్ సే హాథ్ జోడో యాత్రకు గ్రామాల్లో మంచి స్పందన వస్తోందని పీసీసీ ఉపాధ్యక్షుడు రమేశ్ మహరాజ్ అన్నారు. సోమవారం ఆయన తాండూరులోని బషీరాబాద్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాకేశ్ మహరాజ్, కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహరాజుల కుటుంబం అధికారంలో ఉన్నప్పుడే తాండూరు అభివృద్ధి జరిగిందన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో తన నాన్న మాజీ మంత్రి మాణిక్‌రావు, బాబాయ్ చందుమహరాజ్‌లు మంత్రులుగా ఉన్న సమయంలో తాండూరు ప్రాంతాన్ని పారిశ్రామికరంగంలో అభివృద్ధి చేశారన్నారు. రాకేశ్ సొంతగూటికి రావడాన్ని స్వాగతిస్తున్నానన్నారు. రాకేశ్ మహరాజ్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి బలమైన కేడర్ ఉందన్నారు. ఎమ్మెల్యే వెంట వెళ్లింది కాంగ్రెస్ పార్టీలోని కచరా మాత్రమే అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు థారాసింగ్, ఉత్తమ్‌చంద్, ఎంఎ అలీం, హబీబ్‌లాల, జనార్ధన్‌రెడ్డి నాయకులు తదితరులున్నారు.

పరిశుభ్రతకు సహకరించండి

మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి



తడి, పొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మేనేజర్, సిబ్బంది

తాండూరు టౌన్: పట్టణ ప్రజలు పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలని మున్సిపల్ మేనేజర్ నరేందర్ రెడ్డి అన్నారు. సోమవారం 6వ వార్డులో బీఆర్‌ఎస్ కౌన్సిలర్ రవిరాజుతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్డీఓ అశోక్ కుమార్ ఆదేశానుసారం పట్టణంలోని వార్డుల్లో పర్యటిస్తూ ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు మన చుట్టూ ఉన్న పరిసరాలను సైతం శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంట్లోని చెత్తను మురుగు కాల్వల్లో, రోడ్లపై వేయడంతో ఈగలు, దోమలు వ్యాప్తి చెంది, అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. తడి చెత్త, పొడి చెత్త మున్సిపల్ వారు అందజేసిన రెండు డబ్బాల్లో ఉంచి చెత్త సేకరణదారులకు అందజేయాలన్నారు. దీంతో రీసైక్లింగ్‌కు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రభుత్వ నిషేధిత ప్లాస్టిక్‌ను వాడరాదన్నారు. సరుకులకు, కూరగాయలకు వెళ్తే వెంట జూట్ బ్యాగులను తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ప్రవీణ్ గౌడ్, టీఎంసీ సరిత తదితరులు పాల్గొన్నారు.

సేవలపై ఆరా

తాండూరు పట్టణంలో కొనసాగుతున్న ఉచిత కంటి వెలుగు వైద్య శిబిరాన్ని మున్సిపల్ మేనేజర్ నరేందర్ రెడ్డి పరిశీలించారు. సోమవారం మల్‌రెడ్డిపల్లి, విజయ విద్యాలయ పాఠశాల ఆవరణలో నిర్వహించిన కంటి వెలుగు శిబిరాన్ని మేనేజర్ సందర్శించారు. సేవల గురించి తెలుసుకున్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

సహకార సంఘం చైర్మన్ ప్రవీణ్‌రెడ్డి



పంచలింగాల జట్టుకు ట్రోఫీ, నగదు బహుమతి అందజేస్తున్న ప్రవీణ్‌రెడ్డి

మర్పల్లి: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని మర్పల్లి సహకార సంఘం చైర్మన్ ప్రవీణ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పట్లూర్ గ్రామంలో ఎస్‌కేఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీల్లో ఆయా మండలాల నుంచి 38 టీంలు పాల్గొనగా ఫైనల్ మ్యాచ్‌లో పట్లూర్, పంచలింగాల జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. పట్లూర్ టీం గెలుపొందగా, పంచలింగాల టీం ద్వితీయస్థానంలో నిలిచింది. విజేత జట్లకు రూ.33వేలు, రూ.15వేల నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు రమేశ్, రవీందర్‌రెడ్డి, రాజు, ఎంపీటీసీల ఫోరం మండల చైర్మన్ రవీందర్, పట్లూర్ ఎంపీటీసీ మాజీ సభ్యుడు రవి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అభినందనల వెల్లువ



అనంతగిరి: కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీఎన్‌జీఓ ప్రతినిధులు

అనంతగిరి: నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన నారాయణ రెడ్డిని టీఎన్‌జీఓ జిల్లా ప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్, ప్రధాన కార్యదర్శి అజ్మత్‌పాషా, నర్సింలు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌ను సన్మానిస్తున్న వీఆర్‌ఏలు

అదనపు పనులు చేయించకూడదు

వీఆర్‌ఏలతో అదనపు పనులు చేయించకూడదని వీఆర్‌ఏ జేఏసీ జిల్లా చైర్మన్ సత్యనారాయణ అన్నారు. సోమవారం కలెక్టర్‌ను వీఆర్‌ఏ జేఏసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. వీఆర్‌ఏలతో స్వీపర్లుగా, నైట్ వాచమెన్‌లుగా, సుద్ద గనుల్లో, ఇసుక దిబ్బల దగ్గర చేస్తున్న విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. ఆర్‌డీఓ, కలెక్టర్ కార్యాలయాల్లోనూ అదనపు పనులు చేయించకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోచైర్మన్ గోపాల్, ప్రధాన కార్యదర్శి చంద్రయ్య, కన్వీనర్ బాలరాజు, కో కన్వీనర్లు సరోజ, వెంకటయ్య, శివకుమార్, జనార్ధన్, శ్రీశైలం, ఆంజనేయులు, మహేందర్, సీఐటీయూ నాయకులు మల్లేశం, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమానికి కృషి చేయండి

పరిగి: కలెక్టర్ నారాయణరెడ్డికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారని ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను అర్హులైన బీసీలకు నిరుపేదలకు అందేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు రాజేందర్, అనంతయ్య తదితరులు ఉన్నారు.

పదోతరగతి ఉన్నత విద్యకు కీలకం

డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న మనోహర్‌రెడ్డి

పరిగి: పదోతరగతి ఉన్నత విద్యకు కీలకమైనందున విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి సూచించారు. సోమవారం పట్టణ కేంద్రంలోని నంబర్–1, బాలిక ఉన్నత పాఠశాల, మాదారం, చిట్యాల, రాపోల్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు బీఎంఆర్ ఫౌండేషన్ అదంజేస్తున్న స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానన్నారు. గతంలో పరిగిలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ ఏర్పాటు చేస్తే వందల మంది నిరుపేదలు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని గుర్తుచేశారు. మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని ఉన్నత ఫలితాలు సాధించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మౌలిక వసతులను కల్పించేందుకు ప్రభుత్వం మన ఊరు మన బడి కార్యక్రమంతో పాఠశాలల రూపు రేఖలు మారుతున్నాయన్నారు. ఈ ఏడాది పదో తరగతిలో మండల టాపర్లకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌వర్ధన్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మొగులయ్య, రాఘవేందర్‌రెడ్డి, యాదయ్యగౌడ్, బాబయ్య, వెంకట్‌రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుణాల మంజూరుపై నిరసన

- మద్దతు తెలిపిన వైస్ ఎంపీపీ మధులత
- అర్హులందరికీ మంజూరు చేయాలని డిమాండ్



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మైనార్టీలు

పెద్దేముల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు ప్రకటన విడుదల చేసింది. దీంతో మండల పరిధిలోని 30 గ్రామ పంచాయతీల నుంచి 397 దరఖాస్తులు చేసుకోగా ప్రభుత్వం మండలానికి ఆరు యూనిట్లు మంజూరు చేసింది. వీటికి సోమవారం మండల కార్యాలయంలో లక్కీడ్రా నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న దరఖాస్తుదారులు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ముస్లిం మైనార్టీలను చిన్న చూపు చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న వైస్ ఎంపీపీ మధులత వారి దీక్షకు మద్దతు తెలిపారు. సర్వసభ్య సమావేశంలో సమస్యపై చర్చిస్తామన్నారు. దళిత బంధు మాదిరిగానే మైనార్టీ కుటుంబాలకు సైతం రూ.10లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం తీసిన లక్కీడ్రాను రద్దు చేయాలని కోరుతూ ఎంపీడీఓ లక్ష్మప్ప, ఎంపీఓ షేక్‌సుస్మాలకు వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తానని వారు చెప్పారు.

ఓర్వలేకనే అక్రమ అరెస్టులు

చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

యాలాల: తాండూరులో బీజేపీ పటిష్టమవుతున్నందునే అధికార పార్టీ నాయకులు ఓర్వలేక కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారని చేవెళ్ల మాజీ ఎంపీ, బీజేపీ నేత కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్ బీజేపీని పటిష్టం చేసేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. పార్టీలో చేరికలతో పాటు కార్యకర్తల సమావేశాలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో అధికార పార్టీ నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారు. అధికార అండతో సంబంధం లేని కేసులో అరెస్టు చేయించారని ఆరోపించారు. మురళీ కృష్ణగౌడ్ డ్రైవర్ బాలు ఆదివారం రాత్రి యాలాల మండల పరిధిలోని అగ్గనూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై అనుమానాలున్నాయన్నారు. నగరంలో బాలు చికిత్స పొందుతున్న ఆస్పత్రికి వెళ్లి పరామర్శించి వివరాలు సేకరించారు. బాలు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారన్నారు. హిట్ అండ్ రన్ చేసి బాలుపై హత్యాయత్నం చేశారని ఆరోపించారు. ఈ విషయంలో పోలీసులు సమగ్ర విచారణ చేపట్టి నిందితులను పట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు హన్మంతు, మండల అధ్యక్షుడు మహిపాల్, కార్యదర్శి వెంకటేశ్, రామ్లునాయక్, యాదగిరి తదితరులు ఉన్నారు.

బూత్‌స్థాయిలో పార్టీ బలంగా ఉంది

అనంతగిరి: బీజేపీ బూత్ స్థాయిలో పటిష్టంగా ఉందని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ టీఆర్‌ఎస్‌కు ప్రజల్లో భరోసా లేకనే బీఆర్‌ఎస్‌గా మారిందని విమర్శించారు. ఎన్నికలు ఎపుడు వచ్చినా ఎదుర్కొనేందుకు బీజేపీ సిద్ధంగా ఉందన్నారు. యాలాల్‌లో మా పార్టీ నాయకులపై కావాలనే దాడులు చేస్తున్నారని ఆరోపించారు. ఆయన వెంటన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్‌గౌడ్ తదితరులున్నారు.